# సుజాత(కం)

రచన:
నందిని సిరారె

అమ్మ పిలుపులకు సుజాత అదిరిపడింది. తీయగా కంటున్నకల, హాయిగా పాడుకొంటున్న పాట; ఆఫీసర్ని చూచి బెదిరిపోయే గుమాస్తా పాడు బుద్ధుల్లా; మంత్రి పదవికోసం కలలు కంటున్న ఎమ్మెల్యే, ఎన్నికల్లో ఓడిపోయాడన్న వార్త విన్న నాయకుడి ఆలోచనలలా చెదిరిపోయాయి. "ఒసేయ్ సుజాతా! ఏం చేస్తున్నట్టే ఇంకా పలకవూ?" మళ్ళీ అమ్మ పిలుపు వినటంతో "వచ్చేస్తున్నానే" అంటూ లోనికెళ్ళింది తన పాటకు స్వస్తి వాచకం పలుకుతూ. సుజాతకి పదహారేళ్ళుంటాయి, అంటే నిండు జవ్వని అన్నమాట. ఆమె అందాన్ని వర్ణించడానికి నారాయణ రెడ్డి అయితేనే సరిపోతాడు, అతడన్నట్లు "రామప్ప గుడి మోమున విరిసిన రాగిణిలా, గాగిణిలా, అజంతా చిత్ర సుందరిలా, ఎల్లోరా శిల్ప-మంజరిలా" మెరిసిపోయే అప్సరసలా ఉంది.

మా వరండాలో నిల్చుని చూస్తే వాళ్ళ వరండా అగుపిస్తుంది, అందుకే నేను (ఆడ) పిల్ల గాలికోసమని వరండాలో కూర్చుంటే ఆమెకూడా ఎందుకో వరండాలోకి వచ్చి నిల్చునేది, అంతే.

రోజూ నేను ఆమెని, ఆమె నన్ను, ఒకరినొకరము చూసుకుంటూ గడిపే వారము, ఎప్పుడైన సాయంత్రం వాళ్ళ వరండాలో ఆమె లేకున్నా, మా వరండాలో నేను లేకున్నా, యిద్దరి మధ్య మిగిలేది మిథ్య, నిరాశ, నిస్పృహ, వేదన, రోదన...

మూడు రోజులుగా ఆమె ముఖం అగుపించక పోయే సరికి హనుమంతుడ్ని రాయబార పంపాను.

ఆమె వాళ్ళక్కయ్య ఇంట్లో ఏదో పండుగైతే వెళ్ళిందట, ఆ విరహ వేదనతో సిద్దిపేటలో ఉండ బుద్ధి కాలేదు, ప్రక్కనున్న పల్లె కెళ్ళి నాల్రోజులు కాలక్షేపం చేసి రావాలని బయలుదేరాను.

నేను వెళ్ళిన రోజే సుజాత వచ్చిందట, ఆ రోజు వరండాలో నేను కనబడకపోయేటప్పటికి నేను మూడు రోజులుగా అనుభవించిన వేదననే అనుభవించిందట, క్షణ మొక యుగంగా గడిపిందట.

సుజాత సినిమాకని బయలుదేరింది, ఆరోజు నేను కూడ సినిమా కెళ్ళాను కొత్త సినిమా వచ్చినదంటేవిని.

సుజాత వెంట ఓ నరకాసురుడు పడ్డాడు. "మెదక్ (సుజాత) మాటాడవా? నామదిలో ఒక పాట పాడవా? వెత్తిగా నరకాసురుడి అరుపులు, [అమధ్య సుజాత మెదక్‌లో నాట్య ప్రదర్శన ఇచ్చిందట. అందుకని ఆమె పేరు "మెదక్" నిక్‌నేమ్‌గా వాడుతుంటాడు] ఆ నరకాసురుడికి నేనంటే చాలా భయం, నేను సుజాతకి చేరువ కాగానే యేదులా జారుకున్నాడు, సుజాతకి నాకు మాటలు ఇంకా లేకపోవటంతో ఆమెని మాట్లాడించలేక, ఆమెకంటే ముందుగా వెళ్ళిపోయాను.

బాలాజి టాకీస్‌నుండి, ఉత్తిత్తిగా ఊరేగింపులు జరిపే, ఉగ్రవాద రాజకీయ నాయకుల గుంపుల్లా, గుంపులుగా వస్తున్నారు జనం.

అందరూ వెళ్ళిపోయారు, సుజాత ఒక్కర్తే మిగిలింది, అంత సేపూ నాచేతిలో రెపరెప లాడుతున్న కాగితం ఆమె పమిటకు తగిలింది.

పచ్చవోణీ, ఎర్రలంగా, తెల్ల జాకెట్ వేసుకొని ఈస్ట్‌మన్ కలర్ సినిమా హీరోయిన్‌లా మెరిసిపోతుంది, ఆమె చేతచేతలు నేను విసిరిన కాగితాన్ని అందుకొని, కాటుక కన్నుల్ని కదిలిస్తుంటే నాపాదాలు ఆమెకంటే వేగంగా పడినవి.

సుజాత నాల్గు సార్లు చదివింది, ఆ కాగితంలోని ముత్యాలను మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంది.

"పారిజాతపూతా! ఓ సుజాతా!

నీవు వరండాలో కనిపించని రోజులు, మా వరండాలో విరమూయని విరజాబులు, నీవులేని నా వాదన, రోదన, ఆ వేదన, ఈ రోజు నిన్ను చూశాను. ఆదే వేలు, ప్రతి రోజు వరండామీద కనిపిస్తే నాకదే చాలు, నా మాట మన్నిస్తావు గదూ!

ఇట్లు,
నీ లేఖకు నిరీక్షిస్తూ,
'సుధాకర్'

మరుదినం మార్కెట్‌కి వెళుతున్న నేను నా చేతికి




ఏదో తగిలినట్లనిపించి చుట్టూ చూశాను, ఒక వంక సుజాత సుందరి, మరోవంకా కాగితపు పందిరి కనిపించింది, వొంగి ఆ కాగితాన్ని అందుకున్నాను.

నవనవలాడుతూ నవ్వుల పువ్వుల్లా ఉన్న అక్షరాల్ని నలభై సార్లు చదివాను.

సుధలు చూపే ఓ సుధాకర్ !

నీవనుభవించిన రోదన నేనూ అనుభవించాన్న, మా వరండాలో వాడిన వాసనే మిగిలింది, నీకోసం చూడగానే

## గమనిక

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ భాద్యులుకాము. —సంపాదకుడు.

సంతోషం పొంగింది; స్వప్నలోకం లంఘించింది, నీవు కూడా రోజూ వరండాలో అగుపించి మదిలో ఆనందం నింపతావు కదూ !

ఇట్లు,
'సుజాత'

కొన్ని నెలలు గడిచాయి, మా యిద్దరిమధ్య ప్రేమ. మాటల్లోకి రాలేదు, కాగితాల్లోనె ఉంది, చివరికి ధైర్యంతో సుజాతను నేను చేసుకోవాలనుకుంటిని, ప్రయత్నాలు చేశాను, కాని—కులం అడ్డొచ్చింది పానకంలో పుడకలా. ఆ పుడక తీసేసేలోగా అంతస్థు కొట్టొచ్చింది ఆడదాని కోపంలా, ఆ పానకంలో విషం పడింది, పానకాన్ని తాగడానికి ఇద్దరమూ భయపడి పోయాము.

* * *

సుజాత పెళ్ళి చేసుకొని అత్తగారింటికి తన ధనవంతుడైన భర్తతో వెళుతున్న దృశ్యాన్ని చూస్తుంటే మనసుకి గాయమే చేసినను ఆమె చేసిన పని సరియే అనిపించింది, ఎందుకంటే సుజాతని బీదవాడెవడు చేసుకొనిన ఆమెని సుఖపెట్టడం కష్టమే.

సుజాత అంటే అదృష్టజాతకురాలన్నట్టు, అంతటి సున్నితమైన మనసు, నన్ను అంగీకరిస్తే ఆమె పేరు అపవిత్రమైపోతుంది, అదీ అక్రమమే మరి, అందుకే సుజాత ధనవంతుడ్ని చేసుకోవడమే మంచిది.

"ఉన్నోడు ఉన్నోడి స్నేహమే చేస్తాడు."

"లేనోడు లేనోడి మైత్రినె కోరతాడు"

అదృష్ట జాతకురాలు అదృష్ట జాతకుడినె వరిస్తుంది, దురదృష్ట జాతకుడితో పొత్తెట్లా కుదురుతుంది? అందుకే **'సుజాత' ది (సు) జాతకం.**

కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
స్థాపితం - 1938.
విడి ప్రతి — 0-40 పైసలు.
సంవత్సర చందా — రూ. 7-50.
(రెండు ప్రత్యేక సంచికలతోసహా)
నేడే చందాదారలుగా చేరండి